సాక్షి మహబూబాబాద్

శనివారం | 24 | మే | 2025



పుష్కర 'కష్టాలు'

కాళేశ్వరంలో సరస్వతినది పుష్కరాలకు వస్తున్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. శుక్రవారం సుమారు ఏడు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. - 10లో▸



ట్రాలీ అడుగును అరలుగా మార్చి..

ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో నిషేధిత ఎండు గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $35^{0}/25^{0}$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మానుకోటలో అబార్షన్

ముగ్గురిపై కేసు నమోదు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన అబార్షన్ ఘటనపై 'గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్‌కు యత్నం' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు అబార్షన్ ఘటనపై విచారణ ముమ్మరం చేసిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.రవిరాథోడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. సదరు మహిళా అబార్షన్‌కు కారణమైన కాంతి మెమోరియల్ ఆస్పత్రి నిర్వాహక వైద్యులు రామకృష్ణ నాయక్, మహిళను అబార్షన్ కోసం తీసుకువచ్చిన ఆర్ఎంపీ వైద్యుడు గణేష్, ఆమెకు స్కానింగ్ నిర్వహించిన నెక్కొండకు చెందిన యూఎస్‌జీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడా హాస్టల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అర్హులైన బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారిణి ఓలేటి జ్యోతి శుక్రవారం తెలిపారు. జూన్ 1 నుంచి 13వ తేదీ వరకు పలు క్రీడా అంశాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. జూన్ 1న సిద్దిపేటలో వాలీబాల్, జూన్ 10, 11 తేదీల్లో ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్, వెల్‌డ్రోమ్, హనుమకొండలో అథ్లెటిక్, జిమ్నాస్టిక్ ఎంపిక ఉంటుందన్నారు. స్టడీ సర్టిఫికెట్లు, కుల ఆదాయం, నివాసం, 5 పాస్ ఫొటోలతో ఆయా జిల్లాల్లో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని, అండర్ 14 నుంచి అండర్ 16 వరకు వయస్సుల వారీగా ఎంపికలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి కేసముద్రంలో 17 రైళ్లకు హాల్టింగ్



కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నేటి (శనివారం) నుంచి 17 రైళ్లకు తాత్కాలికంగా హాల్టింగ్ కల్పించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజీపేట-కొండపల్లి రైల్వే సెక్షన్ల మధ్య జరుగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల కారణంగా చేపట్టిన నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్స్‌తో మహబూబాబాద్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ తొలగించి, కేసముద్రంలో హాల్టింగ్ కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 24 (శనివారం) నుండి 26వ తేదీ వరకు మణుగూరు-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (12746), మచిలీపట్నం-బీదర్ (12749), కాకినాడ పోర్ట్-లింగంపల్లి (12737), గూడూరు-సికింద్రాబాద్ (12709), తిరుపతి-సికింద్రాబాద్ (12763), విశాఖపట్నం-హైదరాబాద్ (12727), విశాఖపట్నం- మహబూబ్‌నగర్ (12861), తాంబరం-హైదరాబాద్ (12759), భువనేశ్వర్-ముంబాయి సీఎస్‌టీ (11020), షాలీమార్-హైదరాబాద్ (18045), ఈనెల 26న కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డీ(17206), 27న బెంగళూరు-లాల్‌ఖాన్(05073), కోయంబత్తూర్-ధన్‌బాద్ (03680), మచిలీపట్నం-సాయినగర్ షిర్డీ (17208), 24న తిరుపతి-కరీంనగర్ (12761), ఈనెల 26, 27వ తేదీల్లో నర్సాపూర్-నాగర్‌సోల్ (12787), 25 నుంచి 27 వరకు చెన్నై సెంట్రల్- అహ్మదాబాద్ ఎక్స్‌ప్రెస్ (12656)లకు హాల్టింగ్ కల్పించనున్నట్లు తెలిపారు.

ఎంబీఏ పరీక్షల పరిశీలన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం క్యాంపస్‌లోని కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంటు విభాగం పరీక్షకేంద్రాన్ని రిజిస్ట్రార్ వి.రామచంద్రం సందర్శించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఆయనవెంట కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి, డాక్టర్ ప్రగతి ఉన్నారు.



పుష్కరిణికి మొక్కుతున్న యువతులు



సైకత శిల్పానికి పూజలు చేస్తున్న మహిళ

జీవ నది.. ఉప్పొంగిన మది

నదిని చూసిన మది ఉప్పొంగింది. స్నానమాచరించాక కష్టాల గుండె తేలికయ్యింది. చల్లని తల్లికి నమస్కరించాక భయం పటాపంచలైంది. సైకత లింగాన్ని పూజించాక అభయం అందినట్లయ్యింది. ఇలా కాళేశ్వరానికి వచ్చిన వారిలో భక్తి పారవశ్యంలో మునిగిపోయి కనిపించారు. 'సల్లంగ సూడు సరస్వతమ్మా' అంటూ నీటిలో దీపాలు వదిలారు. గోదావరి మాతకు చీరసారె సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. శుక్రవారం కాళేశ్వరం భక్త జన సంద్రమైంది. సుమారు లక్షమందికి పైగా భక్తులు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

సరస్వతియే నమః పుష్కరాలు - 2025

- మరిన్ని ఫొటోలు, వివరాలు 10లో▸



జన సందోహంగా మారిన నది పరిసరాలు

వర్షంతో మొలకెత్తిన ధాన్యం

నర్సింహులపేట: కొనుగోలు కేంద్రాలో రైతుల ధాన్యం మొలకెత్తింది. 20రోజులుగా కాంటాలు పెట్టకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. ముఖ్యంగా మండలంలోని ముంగిమడుగు కొనుగోలు కేంద్రంలో 5వేల బస్తాలు కాంటా వేసి మిల్లులకు తరలించకపోవడంతో తడిసిపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే లారీల్లో ధాన్యం తరలించాలని రైతులు కోరుతున్నారు. నిర్వాహణ సక్రమంగా లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా ఇటీవల డీటీ సుధాకర్‌నాయక్, ఎంఆర్ఐ అఖిల్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ధాన్యం తరలిస్తామని తెలిపారు.

కాంటాపెట్టి 20 రోజులు దాటింది..



నా పొలంలో పండిన 60 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులు అయింది. కాంటా పెట్టి 20 రోజులు దాటిన బస్తాలను తరలించకపోవడంతో అకాల వర్షానికి తడిసి కొంతమేరకు మొలకలు వచ్చాయి. నెల రోజుల నుంచి ఇబ్బంది పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. త్వరగా మిల్లుకు తరలించాలి.

- గుగులోతు లచ్చునాయక్, రైతు, పత్నితండా

సాక్షి ఫోకస్

నిర్వాహకుల ఇష్టారాజ్యం!

డబ్బు, పరపతి ఉన్నవారికి కొనుగోలు కేంద్రాల్లో అందలం



- అమాయక రైతులు రోజుల తరబడి నిరీక్షణ
- వర్షంతో తడిసిన ధాన్యం, మళ్లీ ఆరబెట్టాలంటున్న అధికారులు
- పలు కేంద్రాల్లో అక్రమాలు

సాక్షి, మహబూబాబాద్: రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు మనీ, పరపతి ఉన్నవారికే అనుకూలంగా మారాయి. కేంద్రాల నిర్వాహకులు పద్ధతి ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా కొనుగోలు చేయడం.. వారికి కొందరు అధికారులు వత్తాసు పలుకుతుండడంతో అమాయక రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

పలు కొనుగోలు కేంద్రాల్లో..

జిల్లాలోని పలు కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్తా 40.70 కేజీల తూకం వేయాలి. కానీ 41.50కేజీల తూకం పెడుతున్నారు. అయితే ప్రత్యక్షంగా చూసిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అదే విధంగా రైతులు మిల్లులకు తీసుకెళ్లిన ధాన్యం తూకంలో కూడా తేడా వచ్చిందని, తక్కువ తూకం వేసి మోసం చేశారని రైతులు ఆందోళనకు దిగిన సంఘటనలు ఉన్నాయి. వీటితోపాటు, పలువురు నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తేకున్నా తెచ్చినట్లు తక్‌పట్టీలు ఇచ్చి, మిల్లుకు తరలించినట్లు రికార్డులు చేసిన సంఘటనలు బయటపడ్డాయి. అదే విధంగా కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వరుస క్రమంలో కాంటాలు పెట్టించాలి. అదే క్రమంలో లారీల్లో లోడు వేయించాలి. కానీ కొందరు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్థానిక రాజకీయ నాయకులు, డబ్బులు ఆశచూపిన వారి ధాన్యం ముందుగా కాంటాలు పెట్టి లారీల్లో లోడు వేసి పంపించారని కొన్ని సెంటర్ల వద్ద రైతులు నిర్వాహకులను నిలదీసిన సంఘటనలు ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగినా.. కొన్ని కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పలు రకాలుగా మోసాలకు పాల్పడి రైతులను ఇబ్బంది పెట్టిన సంఘటనలు ఉన్నాయి. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పదే పదే సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేకుండాపోయిందని రైతులు చెబుతున్నారు. తాము తీసుకుంటున్న కమీషన్లలో కొందరు అధికారులకు వాటాలు ఇస్తున్నామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బహిరంగంగా చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంఘటనలు జరిగిన ప్రాంతాలకు వెళ్లిన అధికారులు అన్ని ఆధారాలు ఉన్నా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోలేదని రైతులు అంటున్నారు. దీంతో అక్రమాలకు పాల్పడే నిర్వాహకులు అదే తంతుగా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిర్వాహకులతో అధికారుల కుమ్మక్కు..

గోస పడుతున్నా..



నర్సింహులపేట కొనుగోలు కేంద్రానికి 25రోజుల క్రితం ధాన్యం తెచ్చాను. దుమ్ము, దూళి లేకుండా శుభ్రం చేశాను. తేమశాతం చూసి అన్ని బాగానే ఉన్నాయి అన్నారు. కానీ ఇప్పటి వరకు కాంటాలు పెట్టలేదు. వెనుక వచ్చిన వాళ్లు ముందు కాంటాలు పెట్టుకొని వెళ్తున్నారు. ఇదేంది అంటే ఇంకా ఆగాలని దబాయిస్తున్నారు.

- గోవర్ధన్, ఎర్రలచ్చయ్య గూడెం

ఇరువై రోజుల నుంచి కేంద్రంలోనే..



కురవి కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం ధాన్యం తెచ్చాను. నాలుగు రోజుల క్రితం కాంటాలు పెట్టారు. లారీల కోసం ఎదురు చూస్తున్న సమయంలో అకాల వర్షం కురిసింది. ధాన్యం తడిసి పోయింది. నాకంటే వెనకకు వచ్చిన వాళ్లు కాంటాలు పెట్టుకొని వెళ్లిపోయారు. నేను మాత్రం ఇక్కడే పడిగాపులు కాస్తున్నా.

- తొడుసు ఉమేశ్, రైతు, కురవి

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం



జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని కొందరు నిర్వాహకులు, మిల్లర్లు అక్రమాలకు పాల్పడిన సంఘటనలు మా దృష్టికి వచ్చాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొందరికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం. మరికొందరిపై విచారణ చేపట్టాం. ఇంకొందరిపై కేసులు పెట్టి జరిమానా కూడా వసూళ్లు చేశాం.

- ప్రేమ్‌కుమార్, డీఎస్ఓ, మహబూబాబాద్

జీపీఓ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: ఈ నెల 25న జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రామ పాలన అధికారి (జీపీఓ) పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీలతో కలిసి పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీపీఓల నియామకంలో భాగంగా పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు ఆప్షన్ల కింద అవకాశం కల్పించి జిల్లాలో (152) మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎ.రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, టౌన్ సీఐలు దేవేందర్, సర్వయ్య, ఏఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, చిత్రంలో సుధీర్ రాంనాథ్ కేకన్

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తికావాలి

మహబూబాబాద్ రూరల్/కురవి: . ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం, కురవి, సీరోలు మండలాల్లోని కురవి, కొత్తూరు (సీ), అయ్యగారిపల్లి, నేరడ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, ఇంకా రావాల్సిన ధాన్యం, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్‌లోడ్ అయిన లారీలను అవసరం ఉన్న చోటకు వెంటనే పంపించాలన్నారు. హమాలీలను సిద్ధంగా ఉంచాలని, లారీ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు, సెంటర్ నిర్వాహకులు సంబంధిత క్లస్టర్ సిబ్బంది సమన్వయంతో ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు విజయ, పున్నం చందర్, చంద్రశేఖర్ ఉన్నారు.



కురవి: అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం మండల శాఖ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డీఏపీ, తదితర పురుగుల మందులు ఫర్టిలైజర్స్ స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా నమోదు చేయాలని, లేదంటే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల, గ్రామస్థాయిల్లో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీలు నిరంతరం నిఘా, తనిఖీలు చేస్తామన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఏదైనా సహాయక చర్యలు అవసరమయితే కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ టెలిఫోన్ నంబర్ 7995074803లో సంప్రదించాలన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఫోన్ నంబర్ 87126 56922లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఆర్డీఓ పీడీ మధుసూదన రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ విజయనిర్మల, డీపీఓ హరిప్రసాద్, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డీహెచ్ఓ మరియన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగంతో భూసారానికి ముప్పు

- జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

గార్ల: రసాయన ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించడంతో భూసారం దెబ్బ తిని, నేలలు చౌడుబారి పంటల్లో దిగుబడులు తగ్గుతాయని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల సూచించారు. శుక్రవారం గార్లలోని రైతువేదిక భవనంలో జరిగిన రైతు సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సేంద్రియ ఎరువులు, జీలుగ సాగుతో భూసారం పెరగడంతో పాటు, భూముల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ సదస్సులో మల్యాల శాస్త్రవేత్తలు క్రాంతికుమార్, కిషోర్ కుమార్, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ కావటి రామారావు, రాజు, ఏఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

జవాన్‌కు ఘనసన్మానం



జవాన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని వచ్చిన జవాన్ షేక్ అజహర్‌ను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ జవాన్ కుటుంబ యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జవాన్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనడం జిల్లా వాసిగా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, టౌన్ సీఐ దేవేందర్, ఏఆర్ ఆర్ఐ భాస్కర్, మరిపెడ ఎస్సై సతీష్, జవాన్ అజహర్ తల్లిదండ్రులు ఖాసీం, యాకూబ్ బీ, నాగుల మీరా, సోనీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలొచ్చాయ్

ఆర్టీసీ కార్గోల ద్వారా మండలాలకు తరలింపు

- మొత్తం రావాల్సిన పుస్తకాలు 4,07,850
- జిల్లాకు చేరినవి 2,69,000
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు 1,00,069 మంది
- జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం



ఆర్టీసీ కార్గోలో పుస్తకాలను తరలిస్తున్న సిబ్బంది

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నూతన పుస్తకాలను అందజేసేందుకు చర్యలు చేపట్టింది. 2025-26 విద్యా సంవత్సరానికి జూన్ 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జూన్ 4వ తేదీన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి బడిబాట కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడిబాట నిర్వహించి విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

జిల్లాకు చేరిన 2,69,000 పాఠ్యపుస్తకాలు..

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మానుకోట నంబర్ వన్‌గా నిలిచింది. అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న ప్రతీ విద్యార్థికి పుస్తకాలను అందజేయడానికి అధికారులు తమవంతుగా కృషి చేస్తున్నారు. ఈమేరకు జిల్లాకు 2,69,000 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పాఠ్యపుస్తకాలపై సీరియల్ నంబర్లు ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల ఆధార్‌కార్డు నంబర్‌ను అనుసంధానం చేసుకుని, పుస్తకంపై ఉన్న సీరియల్ నంబర్‌ను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని, ఆధార్, సీరియల్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. కాగా బడిబాట ఖర్చులకు ప్రతీ పాఠశాలకు రూ.1,000 చొప్పున నిధులు ఇచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలాల వారీగా పాఠ్యపుస్తకాలు పంపిణీ..

జిల్లావ్యాప్తంగా 18 మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల విద్యాశాఖ సిబ్బందికి పాఠ్యపుస్తకాలు అందజేయడానికి మండల విద్యాశాఖ కార్యాలయానికి ఆయా మండలాలకు ఆర్టీసీ బస్సు కార్గోల ద్వారా ప్రతీ మండలానికి పుస్తకాలను తరలిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తారు. మొత్తం జిల్లాలో ఉన్న విద్యార్థులు 1,00,069 మంది ఉన్నారు.

సకాలంలో అందజేస్తాం..



కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సు కార్గో రవాణా ద్వారా ప్రతీ మండలానికి పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలను అందజేస్తాం. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో నూతన అడ్మిషన్ల కోసం తమవంతు బాధ్యతగా విద్యార్థులను చేర్పించాలి.

- ఏ.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

వుయ్ వాంట్ 'కేఎఫ్ లైట్'..!

- ఆ బ్రాండ్ బీర్లు దొరకడం లేదని మందు ప్రియుల ఆందోళన

నెల్లికుదురు: కాలనీ మంచినీరు రావడం లేదనో.. ధాన్యానికి మద్దతు ధర రావడం లేదని ఆందోళనలు, రాస్తారోకోలు చేయడం చూస్తుంటాం. కానీ ఇక్కడ కేఎఫ్ (కింగ్‌ఫిషర్) లైట్ బీర్లు దొరకడం లేదని మందు ప్రియులు వైన్స్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని వైన్‌షాపుల్లో కేఎఫ్ లైట్ బీర్లు దొరకడం లేదని, ఆ బ్రాండ్ బీర్లను బెల్ట్ షాపులకు తరలించి సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు అమ్ముతున్నారని మందుప్రియులు గణేశ్ వైన్‌షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. షాపు షట్టర్లు మూసేసి ఆందోళన చేశారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి వైన్ షాపుల్లో కేఎఫ్ లైట్ బ్రాండ్ బీర్లు దొరికే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం గమనార్హం.



వైన్‌షాపు ఎదుట ఆందోళన చేస్తున్న మందు ప్రియులు

పుష్కర స్నానం.. పోటెత్తిన భక్తజనం


త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


పుణ్యస్నానం చేస్తున్న దంపతులు


పిండ ప్రదానం చేస్తున్న భక్తుడు


సరస్వతి నదికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


నీళ్లారగిస్తున్న యువతి


నదిమాతకు హారతి ఇస్తున్న యువతి


అంతర్వాహినిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం ఎదుట..


నవరత్నమాల హారతి ఇస్తున్న పండితులు


మొక్కులు చెల్లిస్తున్న యువతులు


మొక్కులు చెల్లిస్తున్న కుటుంబ సభ్యులు


పసుపు,కుంకుమ సమర్పిస్తున్న మహిళలు


అక్షర జ్ఞానాన్ని ప్రసాదించు సరస్వతి..


సరస్వతి ఘాట్ వద్ద భక్తుల సందడి


పితృదేవతలకు పిండప్రదానం చేస్తున్న భక్తులు


వర్షంలో టెంట్ కింద నిల్చున్న భక్తులు

సమ్మర్ స్పెషల్ రైళ్ల పొడిగింపు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు వేసవి ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పొడిగించినట్లు శుక్రవారం స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి–పాట్నా మధ్య రాకపోకలు సాగించే రైళ్లను పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

పొడిగించిన రైళ్ల వివరాలు..

జూన్ 4వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు చర్లపల్లి–పాట్నా (07255) వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి గురువారం కాజీపేట జంక్షన్‌కు 1:25గంటలకు చేరుకొని వెళ్తుంది. అలాగే చర్లపల్లి–పాట్నా (07256) వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 23:00 గంటలకు చేరుకొని వెళ్తుంది. అదేవిధంగా జూన్ 2వ తేదీ నుంచి జూలై 30వ తేదీ వరకు పాట్నా–చర్లపల్లి (03253) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మంగళ, గురువారాల్లో కాజీపేట జంక్షన్‌కు 23:10 గంటలకు చేరుకొని వెళ్తుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

భక్తకోటి ప్రణామం..

- పుష్కరాలకు తరలివస్తున్న భక్తులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన రద్దీ
- తొమ్మిదో రోజు రెండు లక్షల వరకు రాక

భూపాలపల్లి/కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. తొమ్మిదవ రోజు శుక్రవారం తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలనుంచికాళేశ్వరానికి సుమారు రెండు లక్షల మంది భక్తుల వరకు తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతినదిలో పుష్కర స్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. కాళేశ్వరాలయంలో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. ఈనెల 15న ప్రారంభమైన సరస్వతి నది పుష్కరాలు 26తో ముగియనున్నాయి. మిగిలిన మూడు రోజులు శని, ఆది, సోమవారాల్లో భక్తులు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏకాదశి సందర్భంగా కాశీ పండితులతో శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భగుడిలో హారతితో పాటు పూజలు నిర్వహించారు

ప్రముఖుల పూజలు..

సరస్వతినది పుష్కరాల్లో భాగంగా హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి శుక్రవారం పుష్కరిణిలో స్నానాలు చేసి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆయనకు ఆలయ అధికారులు, పండితులు పూర్ణకుంభస్వాగతం పలికారు. నర్సంపేట, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా స్నానాలు చేసి ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు.


ఏకాదశి సందర్భంగా గర్భగుడిలో ద్విలింగాలకు హారతి నిర్వహిస్తున్న కాశీపండితులు

పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎస్పీలు..

అన్నారం టు పూస్కుపల్లి వరకు ట్రాఫిక్‌జాంను కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే సమీక్షించారు. పార్కింగ్ స్థలాలు, పుష్కరఘాటు, సరస్వతిఘాట్ల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఆలయంలో భక్తులకు సత్వరం దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

తొమ్మిదోరోజు నవరత్నమాల హారతి..

కాశీపండితులతో తొమ్మిది రోజులుగా వైభవోపేతంగా నిర్వహిస్తున్న నవరత్నమాల హారతి శుక్రవారం రాత్రి సరస్వతిఘాటు వద్ద ఘనంగా నిర్వహించారు. హారతి సమయంలో మళ్లీ వర్షం కురిసింది.

పుష్కర 'కష్టాలు'

- ట్రాఫిక్‌తో భక్తులకు తప్పని తిప్పలు
- ఐదు కిలోమీటర్ల నుంచి కాలినడకన భక్తులు
- స్పెషల్ సర్వీసుల కోసం ఎదురుచూపులు
- బురదలో కూరుకుపోయిన వాహనాలు

భూపాలపల్లి అర్బన్ : కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలకు వస్తున్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ట్రాఫిక్ సమస్య నివారణకు పోలీసులు రెండ్రోజుల క్రితం వన్ వే ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం వన్ వేలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాళేశ్వరం నుంచి మద్దులపల్లి వరకు ఏడు కిలోమీటర్ల మేర ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. పుసుకుపల్లి సమీపంలోని ఇసుక డంపింగ్ యార్డులో పోలీసులు హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రైవేట్ వాహనాలు నిలిపి వేశారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్లు కాలినడకన సరస్వతి ఘాట్‌కు పిల్లలు, వృద్ధులు నడుచుకుంటూ వెళ్లారు. పోలీసులు ప్రత్యేక స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి కొందరిని తరలించారు. కొందరు భక్తులు తమ వాహనాలు పంపించాలని పోలీసులతో గొడవకు దిగారు.


హోల్డింగ్ పాయింట్‌లో నిలిచిన వాహనాలు

హోల్డింగ్ పాయింట్‌లో కూరుకుపోయిన వాహనాలు

పుసుకుపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్‌కి ప్రైవేట్ వాహనాలను మళ్లించారు. అకాల వర్షం కారణంగా భూమి పూర్తిగా మెత్తబడడంతో కార్లు, ఆటోలు అందులో కూరుకుపోయాయి. దీంతో పోలీసులు బస్సులను రప్పించి భక్తులను త్రివేణి సంగమానికి తరలించారు. అడవిలో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి తాగే సౌకర్యం లేదు.


కూరుకుపోయిన వాహనాలను బయటికి తీస్తున్న భక్తులు

కాలినడకన ఘాట్‌కు భక్తులు

మద్దులపల్లి వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో ఆర్టీసీ బస్సులో వచ్చిన భక్తులు, పుసుకుపల్లి వద్ద ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్ నుంచి ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన భక్తులు ఐదు కిలోమీటర్ల వరకు పంటపొలాలు, బీడు భూముల మీదుగా గోదావరి తీరానికి నడుచుకుంటూ వెళ్లారు.


వాహనాలను మళ్లిస్తున్న కాటారం డీఎస్పీ


పొలాల్లోంచి నడుచుకుంటూ వస్తున్న భక్తులు


పుసుకుపల్లి రోడ్డులో ట్రాఫిక్‌జామ్

రైతు ర్యాలీకి అనుమతిని పరిశీలించండి

- వరంగల్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27న రైతు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణ కోసం తెలంగాణ రైతు సంఘం పెట్టుకున్న దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని వరంగల్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. శాంతియుత ర్యాలీ, సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ. 'ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వరంగల్‌లోని కార్మిక మైదానంనుంచి సాయి కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో 800 మంది రైతులు పాల్గొనే అవకాశం ఉంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆజంజాహీ మిల్లు మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనిపై పలుమార్లు దరఖాస్తు చేసినా పోలీసులు ఎలాంటి నిర్ణయమూ చెప్పలేదు. అందుకే విధిలేక కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది' అని చెప్పారు. మరోవైపు కలెక్టర్ నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) ఉంటే తప్ప ర్యాలీకి అనుమతి ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ సమర్పించిన తర్వాత మే 17న సమర్పించిన ఆన్‌లైన్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని అనుమతిని పరిశీలించాలని పోలీసులను ఆదేశించారు. చట్టప్రకారం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి


బస్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకలో జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్, కల్వర్టు పనులను కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అలాగే వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులను, పరిసరాలను పరిశీలించి వర్షాకాలం సమీపిస్తుండటంతో పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

ముగ్గురిపై గృహ హింస కేసు

మహబూబాబాద్ రూరల్: ఓ వివాహితను అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై గృహహింస చట్టం కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీటీఆర్ నగర్ కాలనీ చెందిన దుంప స్వప్నకు ఖమ్మం జిల్లా కేంద్రం శివారులోని మారెమ్మ గుడి ప్రాంతానికి చెందిన వంశీతో ఏడాది క్రితం వివాహం జరిగింది. పెళ్లి జరిగిన సమయంలో రూ.3లక్షలు కట్నంగా ఇచ్చారు. డబ్బులు సరిపోవటం లేదంటూ మరో రూ.5లక్షలు తేవాలంటూ స్వప్నను వంశీ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈక్రమంలో ఆమె భర్త వంశీ, అత్తమామలు వెంకన్న అలివేలుపై చర్య తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై అలీంహుస్సేన్ కేసు నమోదు చేశారు.

ట్రాలీ అడుగును అరలుగా మార్చి..

- 400 కిలోమీటర్లు.. 105 గంజాయి ప్యాకెట్లు
- 210 కిలోల 760 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సైదులు


పారిపోబోయిన భాస్కర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి, వరంగల్ : ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అడవి అన్నవరం గ్రామం నుంచి హైదరాబాద్‌కు ట్రాక్టర్ ట్రాలీ అడుగు భాగంలో అరలుగా(చిన్నపాటి గదుల్లా) తయారుచేసి అందులో నిషేధిత ఎండు గంజాయి ప్యాకెట్లని తరలిస్తున్న నలుగురు నిందితులను వరంగల్ యాంటి నార్కొటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 1908 ద్వారా వచ్చిన విశ్వసనీయ సమాచారంతో డీఎస్పీ కె.సైదులు, ఇన్‌స్పెక్టర్ రవీందర్ నేతృత్వంలో 17 మంది సభ్యుల బృందం వరంగల్ ఉర్సుగుట్ట జంక్షన్‌లో నిఘా పెట్టి ముందు ఎస్కార్ట్‌గా వస్తున్న స్విఫ్ట్ కారుతో పాటు గంజాయితో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపారు. తనిఖీ చేస్తే రూ.1,05,38,000ల విలువ చేసే 210 కిలోల 760 గ్రాములు (105 ప్యాకెట్లు) దొరికాయి. నలుగురు నిందితుల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ములుగురోడ్డులోని వరంగల్ యాంటీ నార్కొటిక్స్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ కె.సైదులు మీడియాకు శుక్రవారం వివరాలు వెల్లడించారు.

రూ.పది వేలకు ఆశపడి.. 400 కిలోమీటర్లకు పైగా నడిపి..

ఏపీలోని అడవి అన్నవరానికి చెందిన తల్లిబాబు, నర్సీపట్నానికి చెందిన గోవిందమ్మ గంజాయి రవాణా చేస్తుంటారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం తండాకు చెందిన గుగులోత్ భాస్కర్, కంబాలపల్లి గ్రామం పూరి తండాకు చెందిన కొర్ర వినోద్ కుమార్‌కు తల్లిబాబుతో పరిచయం ఏర్పడింది. అప్పటికే నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగేడు గ్రామానికి చెందిన కేతావత్ రాము నాయక్‌కు గుగులోతు భాస్కర్ పరిచయం ఉండడంతో ఈ గంజాయి అక్రమ రవాణాకు ప్లాన్ వేశారు. ఇందుకోసం రాము నాయక్ నెలన్నర క్రితం రూ1.60 లక్షలకు ఓ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. కిలో గంజాయి రూ.3,500లకు తల్లిబాబు, గోవిందమ్మ వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని శ్రీకాంత్‌కు కిలోకు రూ.పదివేల చొప్పున అమ్మేందుకు ట్రాక్టర్ ట్రాలీ కింది భాగాన అరలుగా తయారుచేసి 105 ప్యాకెట్లను అమర్చి మూడ్రోజుల క్రితం అన్నవరం నుంచి బయలుదేరాడు. అయితే ఈ లోడ్‌ను హైదరాబాద్‌కు చేరవేస్తే రూ.10వేలు ఇస్తామని చెప్పడంతో అనకాపల్లి జిల్లా నీతవరం వలసంపేటకు చెందిన విరోధుల శీను ట్రాక్టర్ డ్రైవర్‌గా ఒప్పుకున్నాడు. సుమారు 400 కిలోమీటర్లకుపైగా ప్రయాణించిన ట్రాక్టర్‌లో ఏమీ లేకపోవడంతో ఎక్కడా చెక్ పోస్టుల వద్ద పోలీసులకు అనుమానం రాలేదు. ఈ ట్రాక్టర్‌కు ముందు భాస్కర్ స్నేహితుడి కారు పైలటింగ్ ఉపయోగించారు. టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం రావడంతో అప్రమత్తమైన వరంగల్ నార్కొటిక్ పోలీసులు ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద భాస్కర్, రాము, వినోద్ కుమార్, విరోధుల శ్రీనును అరెస్టు చేశారు. వీరిని పట్టుకోవడంతో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సైలు శ్రీ కాంత్, రాజు, మొగిలి, హెడ్‌కానిస్టేబుళ్లు రంగ య్య, నిరంజన్, సోమలింగం, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఏ.రాజు, కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, ఎం.రాజేష్, పి.విజయ్, రహీం, కుమారస్వామి, సంపత్, సతీష్, సునీల్‌లను డీఎస్పీ సైదులు అభినందించారు. అయితే ఈ మీడియా సమావేశానికి ప్రధాన నిందితుడు భాస్కర్‌ను తీసుకొస్తుండగా పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంటనే అతడిని లోపలికి తీసుకెళ్లారు.

అప్పు అడిగినందుకు అంతమొందించారు

- భద్రు హత్య కేసులో నిందితుల అరెస్ట్

గూడూరు : తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.సూర్యప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని గుండెంగ శివారు పంతుల్య తండాకు చెందిన తేజావత్ భద్రు హత్య కేసు వివరాలను సీఐ వివరించారు. పంతుల్యతండాకు చెందిన భద్రు మంగళవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి భార్య నీల బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం ఉదయం తండా సమీపంలోని వ్యవసాయ బావిలో భద్రు శవమై కనిపించగా, పోలీసులు హత్యకేసుగా నమోదు చేశారు. కానీ అంతకు ముందే పంతుల్యా తండాకు చెందిన తేజావత్ వీరేందర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనతో పాటు మరో ముగ్గురు తేజావత్ భద్రును చంపినట్లు నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వెంటనే విచారణ చేపట్టగా, భద్రు వద్ద రూ.50 వేలు అప్పు తీసుకున్న వీరేందర్ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అదే తండాకు చెందిన తేజావత్ సురేష్‌కు చెప్పుకున్నాడు. గతంలో భద్రుపై కోపంతో ఉన్న సురేష్, వీరేందర్‌తో కలిసి పథకం పన్నారు. ఈక్రమంలో అదే తండాకు చెందిన తేజావత్ కిషన్, బాదావత్ ఈర్య వారికి సహకరించగా, మద్యం తాగిఉన్న భద్రు మెడకు టవల్ చుట్టి ఊపిరాడకుండా చేసి చంపామని, అనంతరం సమీపంలోని వ్యవసాయ బావిలో వేశామని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణ అనంతరం హత్యకు పాల్పడిన తేజావత్ వీరేందర్, తేజావత్ కిషన్, తేజావత్ సురేష్, బాదావత్ ఈర్యలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సూర్యప్రకాశ్ తెలిపారు. గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి, కొత్తగూడ ఎస్సై కుషకుమార్, ట్రెయినీ ఎస్సై కోటేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ సూర్యప్రకాశ్

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

జనగామ రూరల్ : హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి సుచరిత శుక్రవారం తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాచరాజు హరిచంద్ర ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌కు చెందిన బొమ్మకంటి మల్లేశం తమపై హత్యాయత్నం చేశాడని 2017లో సాధన అరుణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి తల్లిదండ్రులపై నిందితుడు బొమ్మకంటి మల్లేశం చికెన్ కట్ చేసే కత్తితో గాయపరచడంతో అప్పటి ఎస్సై రాజన్ బాబు కేసు నమోదు చేశాడు. కానిస్టేబుల్ వంశీ సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా సబ్ జడ్జి సుచరిత నిందితుడికి శిక్షతోపాటు జరిమానా విధించారు.